# వైఎస్ బెదిరించారు!

న్యూఢిల్లీ - న్యూస్‌టుడే

## ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారు
## పార్లమెంట్‌లోనూ దౌర్జన్యమేనా?
## విశ్వాసపరీక్ష పచ్చిమోసం
## ఫిరాయింపుదార్లకు డబ్బు ఎర వేశారు
## లేదంటే యూపీఏకు అంత మెజార్టీ ఎక్కడిది?
## మండిపడ్డ చంద్రబాబు



ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో హత్య చేసిందని తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆరోపించారు. ప్రభుత్వాన్ని నిలబెట్టుకోడానికి నీచ రాజకీయాలు చేసిందని దుయ్యబట్టారు. విశ్వాస పరీక్షను పచ్చి మోసంగా అభివర్ణించారు. చట్టసభ సాక్షిగా ఎంపీలు రౌడీయిజానికి దిగారని దుమ్మెత్తిపోశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని పతాక స్థాయిలో దుర్వినియోగం చేసి సంబరాలు చేసుకోవడం కంటే అనైతికత ఏముంటుందని ప్రశ్నించారు. నైతిక విలువలను తుంగలో తొక్కి, పార్లమెంటును చేపల మార్కెట్‌లా మార్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి వైఎస్ నుంచి తమ పార్టీ ఎంపీలకు ఒత్తిళ్లు, బెదిరింపులు వచ్చాయని బాబు తిట్టిపోశారు. విప్‌లకు విరుద్ధంగా వ్యవహరించిన 29 మందిని అనర్హులుగా ప్రకటిస్తే యూపీఏ ప్రభుత్వానికి మెజార్టీ ఎక్కడుందని సూటిగా ప్రశ్నించారు. "గత 15రోజులుగా బేరసారాలపై దేశవ్యాప్తంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. మంగళవారం అది రుజువైంది. దిగజారుడు రాజకీయాలకు ఇదో నిదర్శనం. ఓటింగ్ సమయంలో స్పీకర్ సరిగా వ్యవహరించలేదు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ తర్వాత సీట్లలో ఎవరూ కూర్చోలేదు. పార్లమెంటు చేపల మార్కెట్‌లా తయారైంది. తమకు అనుకూలంగా ఓటేసేందుకు ఎంపీలకు డబ్బులు ఎర వేశారు. మొత్తం రిగ్గింగ్ జరిగింది. మాపార్టీ సభ్యుడితో తలపడి రౌడీయిజం ప్రదర్శించారు. తుది ఫలితం ప్రకటించేంతవరకూ ఎవరూ సీట్ల నుంచి లేవకూడదు. నిన్నసభలో అలాంటి పరిస్థితే కనిపించ లేదు. ఆరేడుగురు రాజ్యసభ సభ్యులు లోక్‌సభలో కూర్చున్నారు. నిబంధనలూ తుంగలో తొక్కారు. 14మంది క్రాస్‌ఓటింగ్ చేశారు. ఇందులో పాలకపక్షానికి మద్దతిచ్చే వారి సంఖ్య ఏడు. మిగతా ఏడుగురు ప్రతిపక్షాల సభ్యులే. మరో 8మంది గైర్హాజరయ్యారు. ప్రతిపక్షాలకు దక్కిన 256 ఓట్లకు క్రాస్ ఓటింగ్, గైర్హాజరైన వారి 15 ఓట్లు కలిపితే మా బలం 271కి చేరుతుంది. పార్టీల విప్‌లను ధిక్కరించిన 29మందిని అనర్హులుగా ప్రకటిస్తే ప్రభుత్వం మైనార్టీలో పడుతుంది. ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేయమని ఒత్తిళ్లు వస్తున్నట్లు ఆదికేశవులు నాకు చెప్పారు. ప్రభుత్వం బ్లాక్‌మెయిల్‌కు పాల్పడింది. మా సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుంటే రేణుకాచౌదరి, పనబాక లక్ష్మి, ఒవైసీ, లాలూ లాంటి వాళ్లు అడ్డుకున్నారు. పార్లమెంటులో కూడా రౌడీయిజం చేస్తారా? యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు మేం నైతిక విలువలు పాటించాం. విశ్వాసపరీక్షలో ఇలాంటి నీచమైన పనులు ఎన్నడూ జరగలేదు. కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలో ఉన్నా సీబీఐ, ఆదాయపు పన్నుశాఖ అధికారులను ప్రత్యర్థులపైకి ఉసిగొల్పడం ఆనవాయితీ అయింది. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలి" అని చంద్రబాబు హెచ్చరించారు.